శివుడి ఆజ్ఞ లేనిది చీమైనా కుట్టదంటారు. మరి ఆ ఆజ్ఞ జారీ చేయడానికి శివుడు పలకాలి. అందుకు పెదవి కదపాలి. దానికి శక్తి కావాలి. ఆ శక్తే పరమేశ్వరి.. మాత పార్వతి!! ఇంకా చెప్పాలంటే.. శివుడు స్థాణువు. పార్వతి శక్తి. అంతటా నిండిన పరబ్రహ్మలో తేజస్సు ఆమె. ఆయన కారణంగానే ఆమె శక్తి ద్యోతితమవుతుంది. ఆమె ఉండటం వల్లే ఆయన తేజస్సు ప్రస్ఫుటమవుతుంది. అలా ఆ ఇద్దరూ యుగయుగాలుగా ఒకరినొకరూ అంటి పెట్టుకొని ఉన్నారు. ఈ సృష్టికి ముందూ అంతే ఇదిగా ఉన్నారు. ఈ సమస్త జగత్తులూ అనంత విశ్వంలోకి అంతర్లీనమైనప్పుడూ అలాగే ఉంటారు. వివరంగా చెప్పాలంటే.. సతీదేవి పరమశివుణ్ని పతిదేవుడిగా స్వీక రించకముందే.. వారిద్దరూ పుణ్య దంపతులు. పార్వ తిగా పరమేశ్వరుడి మనసు గెలుచుకోకముందే ఉమా దేవి కైలాసనాథుడి పట్టమహిషి. వారి సంయోగాలూ, వియోగాలూ విధి ఆడిన వింత నాటకాలు కాదు. ఆ పెన్నిధులు మనకు పంచిన దాంపత్య నిధులు.

శ్రీహరి నాభి నుంచి కమలం ఉద్భవించింది. అందు లోంచి బ్రహ్మ ఆవిర్భవించాడు.

తన పుట్టుకకు కారణం అడిగాడు.

'సృష్టి కార్యంపై దృష్టి సారించు' అన్నాడు పరమాత్మ.

అంతా చీకటి. అంతలో ఓ కాంతి స్తంభం.

దేదీప్యంగా వెలుగులీనుతున్నది.

పరిశీలిస్తే ఆది లేదు. అంతం తెలియలేదు.

విరించికి పరిస్థితి వివరించి చెప్పేవాళ్లు కనిపించలేదు.

మనోఫలకంపై ప్రణవ నాదం నర్తించింది. ఆ మహాలింగంలో ఓ రూపం అస్పష్టంగా గోచరమైంది.

తను, తనను పుట్టించినవాడు.. ఇద్దరమే ఉన్నామను కున్నాడు అప్పటివరకు! కానీ, మరొకరు ఉన్నారని తేటతెల్లమైంది.

ఆ ఒక్కరు.. ఒక్కరు కాదు, ఇద్దరనిపించింది.

ఇద్దరూ ఒక్కటిగా ఉన్నారనిపించింది.

తరచి తరచి చూశాడు.

ప్రణవాన్ని తలచి తలచి చూశాడు.

తెలిసింది.. అర్ధనారీశ్వరం.

సంపూర్ణ సృష్టికి ఆలంబనం.

**సగము మొగము రాజు.. సగము మొగము రాణి..**
***సగము తనువు కపాలి.. మరి సగము ఒడలు కాళి..***

సృష్టికి మూలం ఈ ఇద్దరే!

చెరి సగం. సమ సగం. అపురూప సమాగమం.





వాగర్థాల సంయోగం. సృష్టి యాగానికి ఆరంభం. అందుకే వాళ్లు ఆదిదంపతులు. ఈ సకల చరాచర జగ త్తుకు మాతాపితరులు. సృష్టికి ముందే జట్టుకట్టిన ఈ ప్రకృతీపురుషులు చూపిన లీలావిలాసాలే సతీ-పశుపతి అనురాగం, పార్వతీ-పరమేశ్వరుల అనుబంధం. యుగ యుగాలుగా కొనసాగుతున్న వీరిద్దరి సంసారం... నేటి ఆలుమగలకూ ఆదర్శం.

***

అర్ధనారీశ్వరులకు సాగిలపడ్డాడు బ్రహ్మ! సృష్టి రచ నకు అనుజ్ఞ ఇవ్వమని ప్రార్థించాడు.

'పురుషుల సృష్టి నీవంతు! స్త్రీ శక్తి అమ్మ చూసుకుం టుంది' అన్నాడట శివుడు. అందుకే, ఈ ప్రపంచంలోని మహిళలంతా అమ్మ సృష్టే! అతివను ఆదిపరాశక్తిగా దర్శించాలన్న మన పెద్దల మాట వెనుక ఉన్న ఆంతర్యం ఇదే! ప్రతి స్త్రీ మూర్తి జగన్మాతే అని ఆర్షధర్మం చెప్పింది అందుకే!!

శివుడి ఆజ్ఞతో బ్రహ్మకు చేతినిండా పని దొరికింది.

రుషులను సృష్టించాడు. తర్వాత ప్రజాపతుల వంతు! ఆపై మనువులు!!

ప్రజాపతుల్లో దక్షుడు దక్షతగలవాడు.

త్రిమూర్తులకు ఇష్టుడు.

పరమేశ్వరి అనుగ్రహం కోసం కఠోర తపస్సు చేశాడు దక్షుడు. అమ్మ ప్రత్యక్షమైంది. 'నువ్వు నా ఇంట బిడ్డగా పుట్టాల'ని కోరుతాడు. మళ్లీ తనను శివుడికే కట్టబెడతా నని హామీ ఇస్తే బిడ్డగా పుడతానంటుంది శక్తి. అలాగే అంటాడు దక్షుడు. ప్రజాపతి ఇంట పరాశక్తి పాపగా పుడుతుంది. సతీదేవిగా అల్లారుముద్దుగా పెరుగుతుంది. సదాశివుడినే సదా స్మరిస్తూ ఉంటుంది. సతీదేవి పెండ్లీ డుకొస్తుంది. స్వయంవరం ఏర్పాటుచేస్తాడు దక్షుడు. వరమాలతో మంటపానికి వస్తుంది అమ్మవారు. అంతటా చూస్తుంది. శివుడు కనిపించడు. 'శివుడు ఎక్కడ?' అని తండ్రిని అడుగుతుంది. 'నిన్ను ఆ బైరా గికి కట్టబెట్టడం నాకు ఇష్టం లేదు. అందుకే పిలువలేదు' అంటాడు దక్షుడు. తండ్రి అమాయకత్వానికి సతీదేవి జాలిపడుతుంది. చేతిలో ఉన్న వరమాలను లీలగా వది లిపెడుతుంది. హారం అమ్మవారి చేతుల నుంచి జారిందో లేదో.. శివుడు ప్రత్యక్షమవుతాడు. హారాన్ని ప్రేమగా స్వీకరించి అంతర్ధానమవుతాడు. ఆయన మీద ఎంత నమ్మకం లేకపోతే.. సతీదేవి అలా హారాన్ని విడు స్తుంది. ఆమె మీద ఎంత ప్రేమ లేకపోతే.. అలా చటు క్కున వచ్చేస్తాడు. మొత్తానికి బ్రహ్మాది దేవతలు ప్రజాప తికి నచ్చజెబుతారు. తన కూతురిని శివుడికి ఇచ్చి కల్యాణం చేయడానికి దక్షుడు అంగీకరిస్తాడు. ఎప్పుడూ కలిసి ఉండే దంపతులు మరోసారి ఇలా నాటకీయంగా కలుస్తారు!

***

కైలాస సదనంలో ఆనందం. ప్రమథ గణాల్లో పర వశం. సతీ-పశుపతి సంసారం సాఫీగా సాగిపోతుం టుంది. కారణాంతరాల వల్ల దక్షుడికి, శివుడికి దూరం పెరుగుతుంది. పరమేశ్వరుణ్ని పరిహసించడానికి నిరీ శ్వర యాగం తలపెడతాడు దక్షుడు. విషయం కైలాసా నికి చేరుతుంది. సతీదేవి కుమిలిపోతుంది. తండ్రికి హితవు చెప్పాలని భావిస్తుంది. యాగానికి వెళ్తానని భర్తను కోరుతుంది. వద్దంటాడు శివుడు. మాటామాటా పెరుగుతుంది. 'ఎంతైనా ఆ దక్షుడి కూతురువు కదా!' అనేస్తాడు శివుడు. తన ఇల్లాలిని ఇంకా పుట్టింటి కొమ్మ గానే చూస్తున్న భర్తపై ఆగ్రహం కట్టలు తెంచుకుం టుంది. పతికి తానేంటో చూపాలనుకుంటుంది సతి. కాళిగా మారుతుంది. ఆ ఉగ్రరూపం చూసి పారిపోవాల నుకున్న శివుణ్ని భైరవిగా, బగళాముఖిగా, ఛిన్నమస్తగా, ధూమావతిగా ఇలా దశ రూపాలు ధరించి.. పది దిక్కు లకూ వెళ్లకుండా అడ్డగిస్తుంది. అమ్మ రూపాలు చూసి తొలుత భయపడతాడు శివుడు. ఆనక ఆశ్చర్యచకితుడు అవుతాడు. 'ఏమిటీ లీల... ఎందుకీ గోల?' అని ప్రశ్ని స్తాడు. 'ఈ దశమహా విద్యకు ఉపాసన క్రమం నువ్వే చెప్పాలని' కోరుతుంది సతీదేవి. అలా ఆ ఆలుమగల కయ్యం అమ్మవారి దశరూపాలకూ కారణమైంది. ఉపా సకులకు వరమైంది.

పరిస్థితి సద్దుమణిగిన తర్వాత సతీదేవిని భారంగానే పుట్టింటికి వెళ్లనిస్తాడు శివుడు. 'దక్షుడి కూతురు' అన్న పేరు చెరిపేసుకోవాలన్నది దాక్షాయణి నిశ్చయం.